ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 19 జూన్ 2025

తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

-మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్

పెద్దపల్లిటౌన్, జూన్18(ఆంధ్రజ్యోతి):పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ బుధవారం 9వ వార్డులోని చీకురాయి రోడ్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించారు. అనంతరం పెద్దపల్లి పట్టణంలోని ప్రగతి నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది సేవల గురించి వివరించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు ఈకార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రూ. 85.94 కోట్లు జమ

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి

పెద్దపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తు న్న రైతు భరోసా పథకం ద్వారా బుధవారం నాటికి జిల్లాలోని 1,22,516 మంది రైతుల ఖాతాల్లో 85 కోట్ల 94 లక్షల ఒక వెయ్యి 801 రూపాయలు జమ అయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశా రు. మొదటి రెండు రోజుల్లో 1,01,397 మంది రైతుల ఖాతాల్లో 54 కోట్ల 70 లక్షల 63 వేల 881 రూపాయలు జమ చేశారని తెలిపారు. బుధవారం 21,119 మంది రైతుల ఖాతాల్లో 31 కోట్ల 23 లక్షల 37 వేల 920 రూపాయలు జమ చేశారని పేర్కొన్నారు.

'ఏక్ పేడ్ మా కే నామ్'
జిల్లా ఇన్‌చార్జిగా సోమారపు లావణ్య



సోమారపు లావణ్య

పెద్దపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అమ్మ పేరిట ఒక మొక్క నాటాలని గత సంవత్సరం భారత ప్రధాని నరేంద్ర మోదీ 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జీగా సోమారపు లావణ్య ను నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా చెట్లు పెంచేలా ప్రోత్సహించేందుకు అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలంటూ జిల్లా అంతటా పర్యటించి అవగాహన కల్పిస్తామన్నారు. చెట్లు నాటడం ద్వారా అవి మనకు కృతజ్ఞతగా ఆరోగ్యాన్ని ఇస్తాయన్నారు. జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ఈ ప్రచారానికి సహకరించాలని, మొక్కలు నాటే దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకుని ఉద్యమంగా మార్చాలని ఆమె కోరారు.

పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



పోలీస్‌స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ

పెద్దపల్లిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సీపీ అంబర్ కిషోర్‌ఝా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తరచూ నేరాలకు పాల్ప డే వారి నేరచరిత్ర ఆధారంగా రౌడీషీట్, సస్పెక్ట్ షీట్లతో పాటు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నేర పరిశోధన దర్యాప్తులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయో గించాలని, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. చివరగా పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఆయన వెంట ఏసీపీ జీ కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్ ఎస్సై లక్ష్మణ్‌రావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మినీ ట్యాంక్ బండ్‌లో శుద్ధి కార్యక్రమాలు



మల్కాపూర్ చెరువులో శుద్ధి చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

కోల్‌సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో మినీ ట్యాంక్ బండ్‌గా గుర్తించిన మల్కాపూర్ చెరువులో బుధవారం శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది, స్వశక్తి మహిళలతో కలిసి చెరువులోని పిచ్చి మొక్కలను తొలగించారు. యంత్రాల సహాయంతో పూడికతీత చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎస్‌ఐ కిరణ్, మెప్మా టీఎంసీ మౌనిక, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



- నెలాఖరు వరకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం
- రైతు భరోసా జమతో సంకేతాలు
- త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం సబ్సిడీ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెలాఖరు వరకు విడుదలయ్యే అవకాశాలు ఉండడంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొన్నది. వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వివిధ వర్గాల ప్రజలను, కుల సంఘాల నాయకులను కలుస్తూ తమకు మద్దతు ఇవ్వాలని అడుగుతున్నారు. గత ఏడాదిన్నరగా స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు, అప్పుడు అంటూ ఊరిస్తూ వస్తుండడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఎదురు చూస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలక వర్గాల గడువు గత ఏడాది ఫిబ్రవరి రెండవ తేదీతో ముగిసింది. జిల్లా, మండల పరిషత్ పాలక వర్గాల పదవీకాలం గత ఏడాది జూలైలో ముగిసింది. అలాగే మున్సిపల్ పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది జనవరి నెలాఖరులో ముగిసింది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాల గడువు ఫిబ్రవరిలో ముగియగా వారి పదవీ కాలాన్ని ప్రభుత్వం ఆరు నెలల వరకు పొడిగించింది.

● పంచాయతీలకు ఆగిపోయిన నిధులు

ఇప్పటికే గ్రామపంచాయతీ పాలకవర్గాల ఎన్ని కలను సకాలంలో నిర్వహించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నేరుగా విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం లేదు. దీంతో గ్రామాల్లో ప్రత్యేక అధికా రులు, గ్రామ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అసెంబ్లీ సమా వేశాల్లో కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించక పోయినా, పార్టీపరంగా 42 శాతం టికెట్లను బీసీలకు ఇస్తామని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల జాప్యం కారణంగా ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండ డంతో ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తున్నది.

● 42శాతం రిజర్వేషన్లపై చర్చ

2023 నవంబర్‌లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికార కాంగ్రెస్ పార్టీ తమ అధికారంలోకి వస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉద్యోగ, విద్యా పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలు, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలను సకాలంలో నిర్వహించ లేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థలతో పాటు, ఉద్యోగ, విద్యా పరంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారుల పాలనను తీసుకువచ్చింది. రిజర్వేషన్లు కల్పించే విషయమై గడిచిన ఏడాది సెప్టెంబర్ అక్టోబర్ మాసాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో రాష్ట్రంలో జనాభాలో అత్యధికంగా 55 శాతానికి పైగా బీసీలు ఉన్నారని నిర్ధారణ అయ్యింది. దీనికి చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ సమా వేశాల్లో కులగణన సర్వే ఆధారంగా బీసీలకు ఉద్యోగ, విద్యాపరంగా, స్థానిక సంస్థల్లో రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ఏకగ్రీవంగా అన్ని రాజకీయ పక్షాలు అసెంబ్లీలో ఆమోదం తెలిపాయి. ఆ బిల్లును ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు దానికి ఆమోదం తెలపకపోగా, దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనాభా లెక్కలతో కలిపి కులగణన లెక్కలు కూడా తేల్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ 2027 సంవత్సరంలో ముగియనున్నది. అప్పటి వరకు

(మిగతా 8వ పేజీలో)

నారుమడిలో జాగ్రత్తలు పాటించాలి

ఫటా.. ఫట్...

- అలివేణి , పెద్దపల్లి మండల వ్యవసాయాధికారిణి



పెద్దపల్లి రూరల్ , జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో రైతులు వరిసాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడి సిద్ధం చేసుకోవడంలో జాగ్రత్తలు పాటించాలని పెద్దపల్లి మండల వ్యవసాయాధికారిణి అలివేణి సూచించారు. ఈ సందర్భంగా ఏవో సస్యరక్షణ చర్యలపై సూచించారు.

ఆంధ్రజ్యోతి : మండలంలో వరి సాగు ఎలా ఉండనుంది?

ఏవో: వానాకాలం సీజన్‌లో పెద్దపల్లి మండలంలోని అన్నదాతలు దాదాపు 28 వేల 300 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అందులో 90 శాతం సన్న రకం, 10 శాతం దొడ్డు రకం ధాన్యాన్ని సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : రైతులు నారు ఏ సమయం వరకు పోసుకోవచ్చు?

ఏవో : వరి రకాలను బట్టి మే చివరి వారం రోహిణి కార్తె నుంచి జూలై 30 వరకు నారు పోసుకోవచ్చు. దీర్ఘకాలిక రకాలు వేసుకునే రైతుల జూన్ 15 వరకు, మధ్యకాలిక రకాలు జూన్ 15 నుంచి జూన్ 30 వరకు , స్వల్ప కాలిక రకాలు జూలై 15 వరకు అతి స్వల్ప రకాలు జూలై 30 వరకు నారు పోసుకోవచ్చు .

ఆంధ్రజ్యోతి : నారుమడిని ఎలా సిద్ధం చేసుకోవాలి ?

ఏవో : నారుమడిని లోతుగా మట్టి మెత్తబడే విధంగా చేసుకోవాలి. 3 గ్రాముల బావిస్టిన్ లేదా ఒక గ్రామం కార్బండైజమ్ తో విత్తనశుద్ధి చేసుకోవాలి. సేంద్రీయ ఎరు వులు వాడుకోవాలి. మొలక చల్లిన తరువాత నారు పచ్చబడేంత వరకు నీరు పలు చగా పెడుతూ మొలకపై ఎండుగడ్డిని కప్పి ఉంచాలి. 4 కిలో గ్రాముల యూ రియాను రెండు దఫాలుగా వేసుకోవాలి.

అధికారులు ప్రొటోకాల్ నిబంధనలను పాటించాలి

● లక్ష్యాల మేరకు మహిళలకు డిసెంబర్‌లోగా రుణాలు ఇవ్వాలి ● కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి వేణుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ఏ పార్టీతో ఉన్నారనే అంశంతో సంబంధం లేకుండా నిబంధనల ప్రకారం ప్రొటోకాల్ పాటించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి వారిని ఆహ్వానించాలని అన్నారు. పెండింగ్ కోర్టు కేసులు, సమాచార హక్కు చట్టం దరఖాస్తుల వివరాలను కూడా అందించాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ కార్యాల యాల్లో ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఫైల్స్ పెండింగ్ పెట్టవద్దని ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అన్నారు. కలెక్టరేట్ విధులకు సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు బి గంగయ్య, సురేష్ పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు మహిళలకు రుణాలు ఇవ్వాలి

స్వశక్తి మహిళా సంఘాల పని తీరు ఆధారంగా నిర్దేశిం చిన లక్ష్యాల మేరకు డిసెంబర్ లోపు రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించి న సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు పక్కా నిబం ధనల ప్రకారం గ్రేడింగ్ విధానం అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఏకరూప దుస్తులు కుట్టు పెండింగ్ పనులు 20 నాటికి పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ యఎం కాళిందిని, అధికారులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి

అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తిస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. పౌష్టికాహారం నిల్వలు, తాగు నీటి సరఫరా చెక్ చేసుకోవాలని అన్నారు. సూపర్ వైజర్లు ప్రతి రోజూ రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని అన్నారు. అంగన్వాడీ తర్వాత వారు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్యకు డైట్ కాంట్రాక్ట్ పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్

చైతన్య జ్యోతి మహిళా సమాఖ్యకు డైట్ కాంట్రాక్ట్

పెద్దపల్లిటౌన్ : చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య కు ప్రభుత్వాసుపత్రిలో డైట్ కాంట్రాక్ట్ కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ చైతన్య జ్యోతి జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు డైట్ కాంట్రాక్ట్ పత్రాన్ని అందించారు. ఈ కాంట్రాక్ట్ రెండు సంవ త్సరాల పాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.కాళిందిని పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల కేటాయింపుపై కమిషనర్ సమీక్ష

పెద్దపల్లిటౌన్, జూన్18(ఆంధ్రజ్యోతి) డబుల్ బెడ్రూం ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్ల కేటాయింపుపై మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి, రాంపల్లి డబల్ బెడ్ రూంల లబ్దిదారుల ఇళ్లకు ఇంటి నంబర్లు , విద్యుత్ మీటర్లు కేటాయించేందుకు ఈ నెల 21 నుంచి మూడురోజుల పాటు పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ సమన్వయంతో స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ప్రొసీడింగ్, లబ్ధిదారుని ఆధార్ కార్డ్ రేషన్‌కార్డ్, అప్లికేషన్ ఫారం, పాస్ పోర్టు ఫొటోలు, ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు రెండేసి సెట్లు తీసుకురావాలని సూచించారు. ఏఈ సతీష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన సాయిబాబా ఆలయం

సుల్తానాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని సాయిబాబా ఆలయ పదహారవ వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. రంగులతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈ నెల 20న వేడుకలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆలయ నిర్వాహక ప్రతినిధి జూలూరి అశోక్ పిలుపునిచ్చారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి

సుల్తానాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కార్యకర్తలు నాయకులు సన్నద్ధం కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకుని ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీరంగ నల్లాన్ చక్రవర్తుల వనజను సంజీవరెడ్డి పరామర్శించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సౌదరి మహేందర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్, ఎల్లంకి రాజు, కందు నూరి కుమార్, ఎనగందుల ఎల్లయ్య ఉన్నారు.

ప్రాణ సంకటంగా కేబుల్ వైర్లు

- స్తంభాలపై ఇష్టారీతిగా ఏర్పాటు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు కరువు

కళ్యాణ్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కేబుళ్ల వైర్లు ప్రాణసంకటంగా మారాయి. ఎక్కడ పడితే అక్కడ పోళ్లకు లెక్కకు మించి కేబుళ్లు ఉండడం, గాలివాన వచ్చినా, భారీవాహనాలు వచ్చినా తెగి పడుతున్న వైర్లను సరిచేయకపోవడంతో ప్రమాదకరంగా మారు తున్నాయి. గోదావరిఖని ప్రాంతంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఎక్కడ చూసినా కేబుల్ వైర్లు గజిబిజిగా కనిపించడం, వాటిని తొలగించి సక్రమంగా చేయాల్సిన కేబుల్ నెట్‌వర్క్‌ల యజమానులు స్పందించడం లేదు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, డాక్టర్స్ స్ట్రీట్ ఏరియాల్లో దాదాపు పోళ్లకు మధ్యలో కేబుల్ నెట్‌వర్క్‌లు ఎలాంటి అనుమతులు లేకుండానే ట్రాన్స్‌కో పోళ్లకు బిగించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వాటిని తొల గించాలని ట్రాన్స్‌కో నోటీసులు జారీ చేసినప్పటికీ కేబుల్ యజమా నులు స్పందించడం లేదు. లెక్కకు లేని నెట్‌వర్క్ యజమానులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కేబుల్ వైర్లను దర్జాగా పోళ్లకు కడుతున్నారు. రాజేష్ థియేటర్ వద్ద ఇటీవల కేబుల్ వైర్లు తెగిపోయి రోడ్లపై మీద వెళ్లే వాహనచోదకులను ఇబ్బందులకు గురి చేసినా సంబంధిత నెట్‌వర్క్ యాజమాన్యం స్పందించక పోగా మున్సిపల్ సిబ్బంది వైర్లను సరిచేశారు. అసలే వర్షాకాలం కావడం, ఎక్కడపడితే అక్కడ రోడ్లపై కేబుల్ వైర్లు తెగిపడడం, వర్షం వస్తే విద్యుత్ షాక్ గురయ్యే ప్రమాదం ఉంది. మరో పక్క ఐరన్ పోల్స్‌కు ఎక్కడ చూసినా 10 నుంచి 15నెట్‌వర్క్‌ల కేబుళ్లను కట్టి ఉంచుతున్నారు. ఇవి ఎప్పుడు తెగిపడ తాయో తెలియని పరిస్థితి. వన్‌టౌన్ పోలీస్‌స్టేసన్ వద్ద 11కేవీ విద్యుత్ లైన్‌కు గజిబిజిగా కేబుళ్లను తగిలించడంతో అవి తెగిపోయి నేలమీద పడిపోయాయి. ఈ నెల 4న ట్రాన్స్‌కో డీఈ, ఏడీఈలు ఇంటర్నెట్ కేబుల్ సంస్థ యజమానులు సమావేశానికి రావాలని సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ రాలేదు. ట్రాన్స్‌కో పోల్స్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా ట్యాక్స్ చెల్లించకుండా దర్జాగా కేబుల్ నెట్‌వర్క్ యజమానులు కేబుళ్లను కడుతున్నారు.



వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర 11కేవీ విద్యుత్ పోల్‌కు ఉన్న కేబుల్ వైర్లు



తెగి రోడ్డుపై పడిన కేబుళ్లు

● వర్షాకాలంలో తెగిపడుతున్నవైర్లు

గజిబిజిగా ఉన్న కేబుల్ వైర్లు గాలివానకు తెగిపడటంతో రోడ్డుపై నుంచి వెళ్లే వారికి ఇబ్బందులు అవుతున్నాయి. మెడకు చుట్టుకోవడం, రాత్రి వేళల్లో కనబడక వైర్లు తాకి ఎంతో మంది వాహనదారులు కిందపడిపోతున్నారు. వైర్లు వర్షం నీటిలో తెగిపడడం వల్ల విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కేబుల్ యజమానులపై చర్యలకు సిద్ధం

- వెంకటేశ్వర్లు, ట్రాన్స్ ఏడీఈ, గోదావరిఖని



రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గజిబిజిగా ఉన్న కేబుళ్లను తొలగించాలని చెప్పినప్పటికీ నెట్ వర్క్ యజమానులు స్పందించడం లేదు. ఈ నెల 4న డీఈ ప్రభాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించినప్పటికీ కేబుల్ నెట్‌వర్క్ యజమానులు హాజరు కాలేదు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పోల్స్ కు ఉన్న కేబుళ్లను తొలగిస్తాం. జరిమానా విధిస్తాం. వారం రోజుల్లో ఎన్ని పోల్స్‌కు కేబుళ్లు ఉన్నాయో లెక్కలు చెప్పాలి. లేకపోతే వైర్లను తొలగిస్తాం.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు : బీఆర్ఎస్

ఎలిగేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయించారని, ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాను ఉన్నతాధికారులు మరోసారి పరిశీలించాలని ఎంపీడీవోకు బీఆర్ఎస్ నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, పార్టీ మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించిన తర్వాతనే స్థానిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే కేవలం తన సొంత గ్రామం పక్కనున్న గ్రామాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, మిగతా గ్రామాలపై వివక్షత చూపిస్తున్నారన్నారు. ఎన్నికలు ఉన్నాయని కొద్దిమంది రైతులకు మాత్రమే ఖాతాల్లో వేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, దుర్గయ్య, నారాయణ, శ్రీనివాస్, చీకటి సంతోష్, కొత్తిరెడ్డి శాంతి రెడ్డి, బాసంపల్లి రాజేష్, వినోద్, శ్రావణ్, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, GOPIDI LACCHI REDDY" S/O. GOPIDI DEVAIAH, "R/O. H.NO : 17-52, PADAMATI, KODIMIAL, JAGITYAL. I, HAVE CHANGED MY NAME AS 'GOPIDI LACHI REDDY" S/O. GOPIDI DEVAIAH @ GOPIDI DEVA REDDY

AJK-16917

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపలడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063
పెద్దపల్లి :- 9550900238

ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి

● మూతపడే స్థితి నుంచి 30 మంది విద్యార్థులతో కళకళ ● బట్టపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంటింటా ప్రచారం

సారంగాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మూతపడే స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఊపిరి పోసాడు ఓ ఉపాధ్యాయుడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండేవారు. దీంతో విద్యార్థులను పక్క గ్రామంలో గల పాఠశాలకు పంపి బడిని మూసి వేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో బట్టపల్లి ఉపాధ్యాయుడు సుధాకర్ ఎలాగైనా బడిని బతికించాలని కంకణం కట్టుకున్నాడు. గ్రామంలో విద్యార్థుల ఇంటింటికీ తిరిగి పోషకులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన ఉంటుందని, పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తారని ప్రభుత్వ పరంగా వచ్చే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాడు. దీంతో గ్రామంలోని పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం బట్టపల్లి ప్రభుత్వ పాఠశాల 30 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు అదనంగా మరో టీచర్‌ను కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బట్టపల్లి పాఠశాలలో విద్యార్థులతో పోషకులు, ఉపాధ్యాయుడు

పోషకుల్లో ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం కల్పించాం
సుధాకర్, బట్టపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు



ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాం. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని భరోసా ఇచ్చాం. ప్రభుత్వ బడుల్లో చదివితే విద్యార్థులకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో అవగాహన కల్పించాం. దీంతో 30 మంది విద్యార్థులను పాఠశాలకు పంపిస్తున్నారు.

నా ఇద్దరు పిల్లలను చేర్పించా
అర్రె ప్రేమానందం, పోషకుడు, బట్టపల్లి గ్రామం



నా ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నా. మా గ్రామంలో అందరూ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించడంతో ఊరిలోని ప్రభుత్వ పాఠశాల మూత పడే పరిస్థితి వచ్చింది. దీంతో ఎలాగైనా పాఠశాలను బతికించాలని గ్రామంలోని తల్లి దండ్రులం సమష్టి నిర్ణయంతో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి, ఫిబ్రవరి 2025లో నిర్వహించిన ఎమ్మెస్సీ (కెమెస్ట్రీ) ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

వ్యాను-కారు ఢీ

● ముగ్గురికి గాయాలు

మల్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజి సమీపంలో బుధవారం డీసీఎం వ్యాన్, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నుంచి మధ్యప్రదేశ్‌కు కొబ్బరి బొండాల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్, కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులోని ఇద్దరికి గాయాలు కాగా రహదారి పక్కన నిలుచున్న పెగడపల్లి మండలం నందగిరికి చెందిన మనెమ్మ అనే మహిళకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. ప్రమాదంలో కారు, డీసీఎం వ్యాన్ ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం అనంతరం డీసీఎం వ్యాన్‌ను పోలీసులు ఠాణాకు తరలించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● తప్పిన పెను ప్రమాదం

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఓ ఆర్టీసీ బస్సు టైరు పగిలి అదుపుతప్పిన సంఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన మండలంలోని ముంజంపల్లి గ్రామశివారులో బుధవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భద్రాచలంకు వెళుతోంది. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామశివారుకు రాగానే బస్సు టైరు పగిలింది. దీంతో బస్సు కుడివైపున గల మరో రోడ్డు వైపునకు దూసుకెళ్లి రేయిలింగ్‌కు ఢీకొని ఆగింది. బస్సులో 26 మంది ప్రయాణికులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

ఓసీపీ-3లో డీజిల్ బోజర్ బోల్తా

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టులో డీజిల్ బోజర్ బోల్తాపడింది. బుధవారం ప్రాజెక్టులోని క్వారీ నుంచి సర్ఫేస్‌కు వెళ్లే దారిలో డీజిల్ బోజర్ ఇంజన్ ఫెయిల్ కావడంతో దారిలో నిలిచిపోయింది. సుమారు 3వేల లీటర్ల డీజిల్‌తో ఉన్న బోజర్‌నుపార్కింగ్ స్థలానికి గ్రేడర్‌సహాయంతో తరలిస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాద సమయంలో బోజర్‌లో డ్రైవర్‌తో పాటు ముగ్గురు కార్మికులు ఉన్నారు. ఇద్దరు కార్మికులు వాహనంనుంచి దూకగా, బోజర్‌లో ఉన్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కండీషన్ సరిగాలేని వాహనం కారణంగా ప్రమాదం జరిగినట్టు కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి.

యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం చెర్లపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక సుధాకర్(28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం మేరకు సుధాకర్ అదే గ్రామానికి చెందిన అపూర్వ అనే యువతిని రెండు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున సుధాకర్ ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న పోడు రైతులు

● వెనుదిరిగిన అటవీశాఖ అధికారులు

వీర్నపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు ప్లాంటేషన్ కోసం సర్వేచేయడం సరికాదని పోడురైతులు మండిపడ్డారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 20సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడుభూముల్లో మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు బుధవారం సర్వేచేపట్టారు. విషయం తెలుసుకున్న అన్నికులాల రైతులు అక్కడికి చేరుకొని మొక్కలు నాటొద్దని అధికారులను వేడుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2005సంవత్సరం తర్వాత ఆక్రమణకు గురైన అటవీభూమిలో ప్లాంటేషన్ కోసం సర్వే చేస్తున్నామని అటవీశాఖ సెక్షన్ అధికారి పద్మలత రైతులకు వివరించారు. పోడుపట్టాల కోసం ప్రభుత్వాలను వేడుకుంటున్నామని ఏళ్లక్రితం సాగుచేసిన భూములను అధికారులు సర్వే చేయ డం సరికాదన్నారు.



సర్వేను అడ్డుకుంటున్న పోడు రైతులు

అధికారులు సర్వేను ఆపకపోతే పురుగుల మందు తాగే పరిస్థితి వస్తుందని రైతులు పేర్కొన్నారు. అక్కడి నుంచి రైతులను పంపించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నించినా వినకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

గౌరెడ్డిపేటలో దొంగల బీభత్సం

● మంగళసూత్రం ఎత్తుకెళ్లిన దుండగులు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్

పెద్దపల్లి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానికులు, పెద్దపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన సొన్నాయి టంకం లక్ష్మీ రాత్రి నిద్రపోతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి మెడలోఉన్న 20గ్రాముల మంగళసూత్రం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అలాగే గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లినట్లు తెలుపుతున్నారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ చేరుకుని డాగ్ స్క్వాడ్ బృందంతో తనిఖీలు చేయించారు. సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన యువతి(22) మంగళవారం అదృశ్యం అయ్యింది. యువతి తనఇంటి నుంచి మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. యువతి తండ్రి అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు బుధవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

జగిత్యాల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా కేంద్రంలోని రిజిష్ట్రేషన్ కార్యా లయ సమీపంలో పాత పగలు మనుసులో పెట్టుకుని ప్రవీణ్ అనే యువకుడిపై పురుషోత్తం అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పురుషోత్తంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణపోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్‌తీగలకు తగిలి కిందపడిన నెమలి

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీపరిధిలోని లక్ష్మీపూర్‌లో జాతీయపక్షి నెమలి బుధవారం ఇళ్లలోకి వచ్చి విద్యుత్ తీగలకు తగిలి కిందపడిపోయింది. అస్వస్థతకు గురవడంతో గమనించిన స్థానికులు నెమలిని చేరదీసి పోలీసులకు సమా చారం అందించారు. అనంతరం పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించారు.

ఫిట్‌నెస్‌లేని బస్సు సీజ్

తిమ్మాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ఓవిద్యాసంస్థ బస్సును బుధవారం నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నట్లు ఆర్టీవో శ్రీకాంత్ చక్రవర్తి తెలిపారు. విద్యాసంస్థలు ప్రారంభం అయినప్పటికీ కొన్నివిద్యాసంస్థలు బస్సులను ఇంకా ఫిట్‌నెస్ చేసుకోలేదన్నారు. వాటిపై ప్రత్యేక తనిఖీలుచేపట్టి సంబంధితవిద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

శంకరపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లిలో ఓవ్యక్తి మద్యానికి బానిసై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన క్యాదాసి వీరస్వామి(45) కొన్ని సంవత్సరాల నుంచి తాగుడుకు బానిసయ్యాడు. ప్రతిరోజు తాగి ఇంటికి వచ్చేవాడు. రోజూ లాగానే బుధవారం కూడా తాగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కూతురు ఇంట్లోకి వెళ్లి చూడగా తండ్రి ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె అరుస్తూ చుట్టు పక్కల వాళ్లను పిలిచి కిందకు దించగా అప్పటికే వీరస్వామి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవపరీక్షకోసం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గాజుల మొగిలయ్య(78) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కాళ్ల నొప్పులు భరించలేక ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టుకు చెందిన కదురుక గంగరాజం(59) అనేవ్యక్తి బుధవారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. కొండగట్టుకుచెందిన కదురుక గంగరాజం కొంత కాలంగా కాళ్లకు తీవ్రబొబ్బలు వచ్చి నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ నయం కాకపోవడంతో నొప్పిభరించలేక బుధవారం మధ్యాహ్నం ఘాట్‌రోడ్డు మధ్యల గుట్ట సమీపంలో క్రిమిసంహారక మందు తాగి పడి ఉన్నాడు. స్థానికులుగమనించి 108లో చికిత్సకోసం జగిత్యాలకు తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నకిరేకల్‌కి చెందిన శివరాత్రి సైదులు హుజూరాబాద్‌లో బావులు తవ్వుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంట్లో కుటుంబ కలహాలతో గొడవలు జరుగుతున్నాయి. దీంతో విరక్తి చెందిన సైదులు బోర్నపల్లి కాకతీయకాలువలో దూకాడు. కాలువలో నీరు లేకపోవడంతో ప్రాణా పాయం తప్పింది. గమనించిన స్థానికులు, అగ్నిమాపకసిబ్బంది సైదులును కాలువలోనుంచి బయటకుతీసి 108లో హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



అరుణ్‌కుమార్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులో ఈనెల10న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుగ్గిళ్ల అరుణ్‌కుమార్(22) అనేయువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. స్థానికులు వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామానికి చెందిన గుగ్గిళ్ల బాలరాజు చిన్నకుమారుడు అరుణ్‌కుమార్‌తోపాటు మరో యువకుడు రాజు సిరిసిల్ల నుంచి వేములవాడకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రగుడు శివారులో కారుఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన అరుణ్‌కుమార్ హైదరాబాద్‌లో వారంరోజులుగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనపై కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు టౌన్‌సీఐ కృష్ణ తెలిపారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

గంగాధర, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన వృద్ధుడు చికిత్సపొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం.. గ్రామానికిచెందిన రేండ్ల రామస్వామి(74) కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పి, మోకాళ్లనొప్పులతో బాధ పడుతున్నాడు. ఎన్నిఆస్పత్రుల్లో చూపించినా ఉపశమనం లేకపోవ డంతో తీవ్రమనస్తాపానికిగురై జీవితంపై విరక్తితో ఈనెల16న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఈనెల17న మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి

● ఇచ్చిన హామీలు అమలుచేసే శక్తినివ్వాలని కోరా



శ్రీవారి ఆలయం ఆవరణలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తదితరులు

తిరుమల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసే శక్తినివ్వాలని శ్రీవారిని కోరుకున్నట్టు మంత్రి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం ఆయ న దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర క్యాబినేట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు. ఆరు గ్యారెంటీల పథకాలకు శ్రీవారు, అమ్మవార్ల ఆశీస్సులు ఉండాలని, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రిగా తనకు ధైర్యాన్ని, ఆశీర్వాదాన్ని ప్రసాదించాలని కోరుకున్నట్టు చెప్పారు. సామాన్య పార్టీ కార్యకర్తగా ఉండే తనకు మంత్రిగా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు.

ఝాన్సీలక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి సాహసం స్ఫూర్తిదాయకం అని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీకౌన్సిలర్ ఏసీఎస్ రాజు అన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ యుద్ధసమయంలో ఝాన్సీలక్ష్మీబాయి చూపిన తెగువ, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. కార్యక్రమంలో సంఘబాధ్యులు అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, చిట్ల గంగాధర్, నారెండుల శ్రీనివాస్, వేముల దేవరాజం, వేముల పోచమల్లు, ఎడ్మల వెంకటరెడ్డి, మల్లికార్జున్, రాజేశ్వర్‌రావు, విఠల్, బాలన్న, రాపర్తి రవి, వీరన్న, భూమన్న, శ్రీనివాస్, అంజన్న, గంగాధర్, రామచంద్రం, నరేందర్, అశోక్ తదితరులున్నారు.

కారు బీభత్సం..

● ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి కారణమైన కారు



పండరీనాథ్(ఫైల్)

వేములవాడ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కారు బీభత్సం సృష్టించడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల వేములవాడ మండలం రుద్రవరం, ఆరెపల్లి గ్రామాల్లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ కారు(టీఎస్08 జీజే8526)లో వేములవాడ నుంచి మద్యం సేవించి అతివేగంగా కరీంనగర్ వైపు వెళుతూ రుద్రవరం గ్రామ సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న దర్శి(35) అనే కార్మికుడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ఆగకుండా అదే అతివేగంతో వెళ్లి పక్కనున్న ఆరెపల్లి గ్రామంలో ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి వస్తున్న వేములవాడ పట్టణానికి మల్యాల పండరీనాథ్(72), అతడి మిత్రుడు చందులను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పండరీనాథ్ అక్కడికక్కడే మృతిచెందగా, చందు కాలు విరిగి తీవ్రగాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ఒకరు పరారీలో ఉండగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సంఘటన జరిగిన తీరును పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుల్లో దర్శి స్థానిక ఇటుక బట్టీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. దర్శి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు అని స్థానికులు చెబుతున్నారు.

133.8 కిలోల గంజాయిని దహనం చేసిన పోలీసులు



పట్టుకున్న గంజాయిని సీపీ గౌస్ ఆలం సమక్షంలో ఇన్సినేటర్‌లో దహనం చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన 133.8 కిలోల నిషేధిత గంజాయిని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డ్రగ్‌డిస్పోజల్ కమిటీ సమక్షంలో బుధవారం దహనం చేశారు. మానకొండూర్ మండలం ఈదుల గట్టెపల్లిలోని వెంకటరమణ ఇన్సినేటర్‌లో నిబంధనల మేరకు దహనం చేసినట్లు అధికారుల తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు వేణుగోపాల్, విజయ్ కుమార్, సీఐలు పుల్లయ్య, సంజీవ్, రజనీకాంత్, ఇన్సినేటర్ ప్లాంట్‌కు చెందిన ప్రతినిధి తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలోని బంగారం చోరీ

మంథనిరూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం గ్రామంలో ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ చేశాడు. ధర్మారం గ్రామంలో కందుకూరి లక్ష్మి అనే వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున సుమారు 3గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న రెండున్న తులాల బంగారం తాడును ఎత్తుకెళ్లాడు. లక్ష్మి భర్త, కుమారులు మరణించారు. పోలీసులకు సమాచారం అందించగా గ్రామంలో విచారణ చేపట్టారు.

గంజాయి పట్టివేత



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద కిలో 180 గ్రాముల గంజాయిని బుధవారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామానికిచెందిన కొంటు అనిల్‌కుమార్, సుభాష్‌నగర్‌కుచెందిన నీర్ల వంశీకృష్ణ వద్ద గంజాయి పట్టుబడిందని, వారిద్దరిని అరెస్టుచేశామని పేర్కొన్నారు. నిందితులు ఇద్దరుకొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డారని, ఎలాగైనా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకొస్తుండగా కరీంనగర్ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద ఎస్సైలు రాజన్న, శేఖర్, భాస్కర్‌రెడ్డి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయితోపాటు సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం తీగలగుట్టపల్లి వద్ద బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్ యజమాని కొండ్ర కృష్ణపై కేసునమోదు చేసినట్లు, కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కొత్తపల్లిమండలం చింతకుంటవద్ద అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఒకట్రాక్టర్‌ను కొత్తపల్లిపోలీసులు బుధవారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌డ్రైవర్‌పై కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మానకొండూర్‌లో నాలుగు ట్రాక్టర్ల పట్టివేత

మానకొండూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక సీఐ సంజీవ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి మానకొండూర్ గ్రామశివారులో పట్టుకొని ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనాలను సీజ్ చేసి యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐతెలిపారు.

ఎస్సారార్‌లో కొత్తగా బీకామ్ రిటైల్ ఆపరేషన్స్ డిగ్రీ కోర్సు


గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) 2025-26 విద్యాసంవత్సరం నుంచి బీకామ్ రిటైల్ ఆపరేషన్స్ అనే కొత్త డిగ్రీ కోర్సు పెట్టనున్నారు. దోస్త్ రెండో విడతలో అనుమతి లభించినట్లు, 60 సీట్లతో ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా కోర్సు రూపొందించినట్లు పేర్కొన్నారు.

ఇంటర్‌లో ఏ గ్రూపు చదివినా కోర్సుకు అర్హులని తెలిపారు. కోర్సుతో విద్యార్థులకు రిటైల్ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. వివరాలకు 98665714 41, 9959 838049, 8341858459నంబర్లలోగానీ, కళాశాల దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను గానీ సంప్రదించాలని సూచించారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూపీఎస్సీ-సీఎస్ఏటీ-2025 (సివిల్ సర్వీసెస్ పరీక్ష) కోసం ఉచిత శిక్షణకు దఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శాఖ ఎస్సీ స్టడీ సర్కిల్, డైరెక్టర్ బండ శ్రీనివాస్ తెలిపారు. బంజారాహిల్స్ హైదరాబాద్‌లో శిక్షణతో భోజన వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. http://tsstudy-circle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 040-23546552, 8121626423 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చదువుదాం.. చదివిద్దాం..



నేడు జాతీయ పఠనా దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శరీరానికి వ్యాయామం ఎలా అవసరమో మనసుకు చదవడం కూడా అంతేనని ఆంగ్ల వ్యాసకర్త, కవి, నాటక రచయిత జోసెఫ్ అడిసన్ అన్నారు. చదవడం వల్ల మెదడు సామర్థ్యం, పనితీరు మెరుగుపడుతుంది. ఈ దిశలో ఇంటర్‌నెట్ ఆధిపత్యం ఉన్న కాలంలో కూడా ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించడానికి, అక్షరాస్యత, పుస్తకాల ప్రాధాన్యం గురించి అవగాహన పెంచడానికి ప్రతీ సంవత్సరం జూన్ 19న జాతీయ పఠన దినోత్సవాన్ని జరుపుకుంటారు. పఠన దినోత్సవం తర్వాత వారం పఠన వారంగా జరుపుకుంటారు.

పఠన దినోత్సవం పుట్టిందిలా..

కేరళలో గ్రంథాలయ, అక్షరాస్యతా ఉద్యమ పితామహుడు పుతువాయిల్ నారాయణ పనికర్ (ఉపాధ్యాయుడు) గౌరవార్థం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. దేశంలో అక్షరాస్యత, విద్యను ప్రోత్సహించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. వ్యక్తులు, సమాజం పురోగతిని, అభివృద్ధిని సాధించాలంటే పుస్తకాల ద్వారా విద్యను పొందడం చాలా అవసరమని విశ్వసించారు. 1945 లో కేరళలో తొలి ప్రజా గ్రంథాలయాన్ని స్థాపించారు.

చదవడం వల్ల ప్రయోజనాలు

చదవడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడుతాయి. కొత్త సమాచారం కొత్త జ్ఞాపకాలను సృష్టిస్తుంది. కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుస్తుంది. రచనల పఠన, లిఖనం అలవాటు పెంచుతుంది. స్పష్టంగా సంభాషించవచ్చు. 30 నిముషాలు చదవడంతో హృదయస్పందన రేటు, రక్తపోటు, మానసిక క్షోభ భావనలు తగ్గుతాయి, నిరాశ, మానసిక రుగ్మతలు నశిస్తాయి. చరిత్ర, సైన్స్, సాహిత్యం వంటి విస్తృత శ్రేణి అంశాలపై సమాచారం లభిస్తుంది. వివిధ విషయాలను అన్వేషించడానికి, ప్రపంచం గురించి లోతైన అవగాహన పొందడానికి వీలు కలుగుతుంది.

గ్రంథాలయాల పాత్ర కీలకం..

చదవులో మన ఇంట్లో ఉన్న పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలతో పాటు గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రంథాలయాల్లో మనకు కావాల్సిన పుస్తకాలు లభిస్తాయి. అక్కడే కాకుండా ఇంటికి పుస్తకాలు తెచ్చుకుని, నచ్చిన అంశాలు, సమాచారాన్ని నోట్ చేసుకొని తిరిగి ఇవ్వవచ్చు.



చదువుతో విజ్ఞానం.. వికాసం
సత్తు మల్లేశం, గ్రంథాలయ సంస్థ చైర్మన్



చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో ఎప్పటికప్పుడు వివిధ రకాల కొత్త పుస్తకాలు, పోటీ పరీక్షల పుస్తకాలు తెప్పిస్తున్నాం. వసతులను మెరుగుపరిచే దిశలో ఉన్నాం. పాఠకుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

రోజు కొంతసేపైనా చదువుతా..
అన్నవరం దేవేందర్, కవి, రచయిత



రోజూ కొంతసేపైనా చదువనిదే నాకు పాలు పోదు. రచయితలు ఇతర రచనలు చదివితేనే వారి సృజనాత్మకత, రచనాశక్తికి పదును పెట్టవచ్చు. పిల్లల నుంచి పెద్దవారి వరకు ఎంతో కొంత సేపు చదవడం నిత్య కృత్యం చేసుకోవాలి.

మానసిక ప్రశాంతత లభిస్తుంది
శ్రీవత్స, విద్యార్థి



నా పాఠ్య పుస్తకాలతో పాటు దిన పత్రిక, ఇతర కథలు, సైన్స్ పుస్తకాలు రోజూ చదువుతాను. ఇలా కొంత సేపైనా చదవడంతో సెల్ ఫోన్, టీవీకి దూరంగా ఉండగలుగుతున్నాను. మానసిక, శారీరక ప్రశాంతత కలుగుతుంది.

ముల్కనూర్ బ్యాంకు ఎన్నికల్లో ప్రవీణ్‌రెడ్డి ప్యానల్ ఏకగ్రీవం

ధ్రువీకరణ పత్రాన్ని అందించిన ఎన్నికల అధికారి



ఏకగ్రీవంగా ఎన్నికైన డైరెక్టర్లు

భీమదేవరపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్యానల్‌కు సంబంధించి ఐదుగురు డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కోదండరాములు తెలిపారు. ఒకటో వార్డు నుంచి ప్రస్తుత బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రెండో వార్డు నుంచి బొల్లంపల్లి కుమారస్వామి, ఐదో వార్డు నుంచి జి శ్రీనివాస్, తొమ్మిదో వార్డు నుంచి గుర్రాల భాస్కర్‌రెడ్డి, 15వ వార్డు నుంచి కాశిరెడ్డి వసంత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారి కోదండరాములు గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులు ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశీవిశ్వనాథరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, ఎన్నికల సహాయ అధికారి రవీంద్ర, లోన్ సెక్షన్ మేనేజర్ జి రాజమౌళి, వెంకటేశ్వర్‌రావు, సతీష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే ఏకగ్రీవ ఎన్నిక
అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్

ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు ఎన్నికల్లో నా ప్యానల్‌కు చెందిన ఐదుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా గెలిపించినందుకు రైతులకు కృతజ్ఞతలు. ఏకగ్రీవ ఎన్నిక కు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు. రైతుల సంక్షేమం, వారికి సకాలంలో రుణాలు ఇస్తాము. ముల్కనూర్ బ్యాంకు సభ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా.



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న ప్రవీణ్‌రెడ్డి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

జగిత్యాల అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన బీసీ సంఘాల మహాధర్నా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదింపజేయడం హర్షణీయం అయినప్పటికీ ఈ బిల్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదింప జేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లు ఆమోదించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తిరుపురం రామచంద్రం, రాచకొండ రోజా ఎలుక బగవాన్, దండుగుల హృషికేష్, అనుమల్ల సంజయ్ స్మామ్రాట్, పాల్గొన్నారు.

ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎం ఫార్మసీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్ 2025లో నిర్వహించిన ఎంఫార్మసీ, ఒకటో, మూడో సెమిస్టర్ ఫలితాలను బుధవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www. satavahana. ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

డంప్ యార్డు తరలించాలని నిరసన



ఇంటింటికీ పోస్టర్ అంటిస్తూ నిరసన తెలుపుతున్న కాలనీ మహిళలు

సుభాష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని డంప్‌యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ అలకాపురి కాలనీ మహిళలు బుధవారం 'ఓటు కాదు.. మాకు ఊపిరి కావాలి' అనే పోస్టర్లను ఇళ్లకు అంటించి వినూత్న నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంప్ యార్డు పొగతో ఇబ్బందులు పడుతున్నామని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నామని, ఆసుపత్రుల పాలవుతున్నామని వాపోయారు. డంప్ యార్డును తరలించాలని ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తులు చేశామని, హామీగానీ, చర్యలు గానీ లేవన్నారు. రానున్న ఎన్నికల్లో తాము ఓటు హక్కును వినియోగించు కోవద్దని నిర్ణయించుకున్నామని తెలిపారు. డంప్‌యార్డును తరలిపు హామీ ఇవ్వాలన్నారు. మునిపల్లి ఫణీత, సరళ, భాగ్యలక్ష్మి, శోభ, శ్యామల, సుమతి, అన్నపూర్ణ, శ్రీలత, పద్మ, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



పూసాలలో బోనాలతో మహిళలు

సుల్తానాబాద్, జూన్ 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలలో బుధవారం ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆదే విధంగా పోచమ్మ తల్లికి కూడా బోనాలు సమర్పించారు. పూసాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు గుర్రాల మల్లేశం ఆధ్వర్యంలలో ఈ ఉత్సవాలను నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే బోనాల వేడుకలలో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించినట్లు మల్లేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చొప్పరి శ్రీనివాస్, కార్యదర్శి కంకనాల సతీష్, మాజీ కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్, సొసైటీ డైరక్టర్లు లక్ష్మయ్య, కనకయ్య, భూతగడ్డ కనుకయ్య, లక్ష్మీనారాయణ, రవి,శ్రీను, కంకణాల అశాలు, ఉస్తెం రవి, సిద్ద తిరుపతి గుర్రాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● **కమాన్‌పూర్** : మండలంలోని జూలపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి బోనాలు బుధవారం అంగరంగ వైభవంగా ముదిరాజ్ కులస్థులు నిర్వహించారు. ప్రతి వర్షాకాలం ముందు గ్రామంలో డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మ వారికి బోనాలు సమర్పిస్తారు. ఈ యేడు వర్షాలు సంమృద్ధిగా కురిసి పాడి, పంటలు పండాలని అమ్మవారికి మెక్కులు చెల్లించుకున్నారు.



జూలపల్లిలో బోనాలతో గీత కార్మికులు

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వేళాయె



● రాష్ట్ర వ్యాప్తంగా 8 యూనివర్సిటీల్లో దరఖాస్తుకు షెడ్యూల్ విడుదల ● జూలై 17 వరకు తుదిగడువు

గణేశ్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రఖ్యాత ఎనిమిది యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 (టీజీపీసీజీ ఈటీ-2025)గా పిలుస్తారు. జూన్ 18 నుంచి జూలై 17 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులందరూ తమకు ఇష్టమైన సబ్జెక్టుల్లో పీజీ కోర్సులను అభ్యసించవచ్చు.

మీ కోసం...

ఎనిమిది వర్సిటీలకు ఒకే దరఖాస్తు

రాష్ట్రంలోని అన్ని ప్రధాన వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పించేందుకు ఉస్మానియా వర్సిటీయే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది. గతంలో ఏ వర్సిటీకి ఆ వర్సిటీ ప్రవేశ పరీక్షను నిర్వహించేవారు. కొన్నేళ్లుగా ఉస్మానియా వర్సిటీ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ, వరంగల్ కాకతీయ, నిజామాబాద్ తెలంగాణ, నల్లగొండ మహాత్మాగాంధీ, మహబూబ్నగర్‌లోని పాలమూరు, కరీంనగర్ శాతవాహన, హైదరాబాద్‌లోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలకు కామన్ ఎంట్రెన్స్ టెస్టు నిర్వహిస్తారు.

కోర్సుల వివరాలు

పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం, అరబీ, ఇస్లామిక్ స్టడీస్, ఉర్దూ, రాజనీతిశాస్త్రం, ఎకానమిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ, సోషియాలజీ, ఎంఎస్‌ఐఎస్సీ, ఎంకామ్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్ బాటనీ, జువాలజీ, మైక్రోబయోలజీ, బయో కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంఈడీతో పాటు ఇతర పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. వీటితోపాటు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులైన ఎంఎస్సీ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, ఎంబీఏతో పాటు ఇతర కోర్సులు ఉన్నాయి.

కంప్యూటర్ పరీక్ష

కంప్యూటర్ బేస్ట్ పరీక్ష (సీబీటీ) నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుల్లో డిగ్రీ సిలబస్ ఆధారంగా ప్రశ్నాలు ఉంటాయి. మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అపరాధ రుసుంతో గడువు

జూలై 24 వరకు రూ.500 అపరాధ రుసుము తోనూ, జూలై 28వ తేదీ వరకు రూ.2వేల అపరాధ రుసుముతోనూ దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. జూన్ 24 వరకు గడువు విధించారు.

దరఖాస్తుకు వెబ్‌సైట్‌లు

https://www.osmania.ac.in/cpget.tsche.ac.in 2025లో దరఖాస్తులు సమర్పించాలి. నిర్ణీత ఫీజులను చెల్లించాలి. హాల్ టికెట్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. కోర్సులు, ఫీజులు, హాస్టల్ వసతితోపాటు సమగ్ర వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.





వెండిపతకం సాధించిన కూనకిషన్

జాతీయ అర్చరీలో ఆర్టీసీ ఉద్యోగికి వెండిపతకం

భగత్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో ఆర్టీసీ జోనల్ వర్క్ షాప్ కరీంనగర్ ఉద్యోగి కూన కిషన్ వెండి పతకం సాధించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు జరిగిన అర్చరీ జాతీయ స్థాయి పోటీల్లో 50 మీటర్లలో వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా కిషన్‌ను ఆర్టీసీ వర్క్ షాపు వర్క్ మేనేజర్ ప్రణీత్, అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, సురేందర్, ఎంఎఫ్ నందు, సూపర్ వైజర్స్ అభినందించారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొండగట్టు అంజన్న సన్నిధిలో జ్యేష్ఠాభిషేకం

108 కళశాలతో ప్రత్యేక పూజలు

మల్యాల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం జ్యేష్ఠాభిషేకాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం 108 కళశాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉపప్రధాన అర్చకులు చిరంజీవి, ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు తదితరులు ఉన్నారు.

సంతలో ట్రాఫిక్ చింత

వెల్గటూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రంలో జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ప్రతీ బుధవారం నిర్వహిస్తున్న సంతలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, వివిధ రకాల వస్తువులు, బట్టలు అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. ఇరువైపులా చిరు వ్యాపారులు కొట్లు ఏర్పాటు చేసుకోవడంతో రోడ్డు కొంత ఇరుకుగా మారుతోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినపుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనితో కూరగాయలు తదితరాలు కొనుక్కోవడానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత రోజు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా పోలీస్ సిబ్బంది నియమించాలని ప్రజలు, వాహనదారులు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.



వెల్గటూర్ సంతలో ట్రాఫిక్ ఇబ్బందులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కోల్‌సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ గమ్యాలకు చేరాలని రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గోదావరిఖని సీఐ రాజేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

పెద్దపల్లిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు గవర్నమెంట్ అసిస్టెంట్ ప్లీడర్ , మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజు సూచించారు. జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ పాఠ శాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయురాలు శ్రీమతి ఎలువాక సరిత పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పోతనకాలనీలో సింగరేణి నిర్మించిన కమ్యూనిటీహాల్ నిర్మాణంలో యాజమాన్య నిర్లక్షం సరికాదని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు పేర్కొన్నారు. బుధవారం పోతనకాలనీలోని కమ్యూనిటీహాల్, గ్రంథాలయం వద్ద కార్మిక కుటుంబాలతో కలిసి పరిశీలించారు. సింగరేణి చేపట్టే అభివృద్ధి పనుల్లో రాజకీయ జోక్యం గతంలో ఎన్నడూ లేదని అన్నారు. పోతనకాలనీలోని కమ్యూనిటీహాల్, గ్రంథాలయాలను ప్రారంభించాలని వైవీ రావు డిమాండ్ చేశారు.

బుధవారంపేట్‌లో రెవెన్యూ సదస్సు

రామగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 78 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సుమన్, డిప్యూటీ తహసీల్దార్ మానస, రెవెన్యూ అధికారులు సంపత్, రాజేష్, మహేష్, మాజీ ఎంపీపీ ఆరెల్లిదేవక్క కొంరయ్యగౌడ్, మాజీ సర్పంచ్ బుద్దార్థి బుచ్చయ్య పాల్గొన్నారు,

రేపు భట్టుపల్లిలో గిరిజనులకు అవగాహన సదస్సు

మంథనిరూరల్ : మండలంలోని భట్టుపల్లి గ్రామంలో ఈ నెల 20న పీఎం దర్తీ అబాజాన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనుల వికాసానికి సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అమలు చేస్తున్న ఈ పథకం కింద భట్టుపల్లి గ్రామం ఎంపికైనట్లు తెలిపారు.

నేడు, రేపు భూభారతి రెవెన్యూ సదస్సులు

మంథని, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులను స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురు, శుక్రవారాల్లో భూభారతి ద్వారా ప్రభుత్వం కల్పించిన ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐని గెలిపించండి

గోదావరిఖని, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐని బలోపేతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ అన్నారు. బుధవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన రిటైర్డ్ కార్మిక సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రిటైర్డ్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పడాల కనకరాజు, సహాయ కార్యదర్శిగా ఎర్రగోళ్లచేరాలు, కోశాధికారిగా రాపోలు రాజేశ్వర్‌రావు ఎంపికయ్యారు.

సీఎంను కలిసిన మాజీ ఎంపీపీ



సీఎం, మంత్రి శ్రీధర్‌బాబుతో కోలేటి

కమాన్‌పూర్, జూన్18 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మాజీ ఎంపీపీ కోలేటి మారుతి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంథని అభివృద్ధిపై సీఎంకు వివరించారు. నియోజకవర్గానికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి, మంత్రి శ్రీధర్‌బాబుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

రామగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీ, మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి తెలంగాణ చౌరస్తాలో గత కొన్ని నెలలుగా పనుల జాప్యంతో కంకరతేలి, గుంతలతో ప్రయాణికు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై 'అధ్వానంగా రహదారి' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. మూడు రోజుల్లోగా తారు వేస్తామంటూ కాంట్రాక్ట్ సూపర్ వైజర్ తిరుపతి ఆన్‌లైన్‌తో తెలిపారు.

సీపీఐ మండల స్థాయి సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సీపీఐ కమాన్‌పూర్ మండల స్థాయి సమావేశం బుధవారం కాలనీలో నిర్వహించారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడారు. దేశంలో పెరుగుతున్న కార్పొరేట్ ముద్ర, శ్రామిక హక్కులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పార్టీ పోరాటాలను ఉధృతం చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గౌతం గోవర్ధన్, మండల సెక్రెటరీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు

పాలకుర్తి,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని మక్కాన్ సింగ్ సేవసమితి చైర్మన్ మనాలి ఠాకూర్ అన్నారు. బుధవారం మండలం పరిధిలోని గుడిపెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాలను అందుకున్న లబ్ధిదారులతో మాట్లాడారు. రెండో విడత మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం

ముత్తారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడేడు, కేసినపల్లి గ్రామాల్లో ఎంపీ, యూపీఎస్ పాఠశాలల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం ఎంఈవో హరిప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టారు. విద్యార్థులు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు తరలిరావాలని అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా బట్టలు, బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు.

చట్టాలతోనే మానవాళికి మనుగడ

ధర్మారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, చట్టాలతో సమాజంలో మానవాళికి మనుగడ ఉంటుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి కె.స్వప్నరాణి అన్నారు. బుధవారం మండలంలోని మేడారం ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఆడ్ కౌన్సిల్ శ్రీనివాస్, అడ్వకేట్స్ జాన్సీ, భానుకృష్ణ, నేరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరుణ దేవుని కరుణ కోసం కప్పతల్లి ఆటలు

పెద్దపల్లి రూరల్ , జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొంపల్లిలో బుధవారం చిన్నారులు వరుణ దేవుడు కరుణించాలని కప్పతల్లి ఆడారు. చిన్నారులంతా రోకలు బండకు కప్పను కట్టి ఇళ్లు ఇళ్లు తిరుగుతూ జలాభిషేకం నిర్వహించారు.

ఇసుక రీచ్‌లతో అడుగంటుతున్న భూగర్భ జలాలు

● పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



మానేరు వంతెనకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీల వల్ల రూపు నారాయణపేట మినహా మానేరు పరివాహక గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి దుర్భిక్షం నెలకొందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మండలంలోని రూపు నారాయణపేట మానేరు వాగు నుంచి విలాసాగర్ వరకు రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ వంతెనకు బుధవారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే సభలో మాట్లాడుతూ మానేరు ఇసుకను కాపాడుకునే బాధ్యత ప్రజలదేనని, అడ్డుకోవడం కోసం ప్రతి గ్రామంలో ప్రజలు చైతన్యవంతం కావాలని అన్నారు. వివిధ మండలాల్లోని 40 గ్రామాల ప్రజలకు నిర్మించబోయే వంతెన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వరంగల్ వైపు వెళ్లేందుకు వంతెన నిర్మాణం వల్ల 20 నుంచి 25కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. ఓదెల ప్రాంతం చివరి ఆయకట్టు ప్రాంతమని, సక్రమంగా సాగునీరు అందదని అన్నారు. ఇక్కడ ఇసుక రీచులను అడ్డుకోవడం వల్లనే పంటల పచ్చదనంతో ధాన్య దిగుబడులు సాధించారని అన్నారు. సన్నవడ్లకు రూ. 1100కోట్ల బోనస్ వేస్తే, కేవలం పెద్దపెల్లి నియోజకవర్గంలో రూ.60 కోట్లు బోనస్‌ను ప్రభుత్వం చెల్లించిందని, అలాగే యాసంగి బోనస్ రూ. 31 కోట్లు రైతులకు త్వరలోనే జమవుతాయన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మానేరు వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచించారు.అలాగే పొత్కపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించిన అనంతరం 53 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించారు. సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య, మినుపాల ప్రకాష్‌రావు, మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, అంబాల కొమురయ్య, సిరిసేటి రాహుల్, వంగ శ్రీనివాస్, అంకం రమేష్, బైరి రవీందర్ గౌడ్, ఆకుల మహేందర్ పాల్గొన్నారు.

పల్లెల్లో స్థానిక సందడి

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది.

● రైతు భరోసా డబ్బులు జమ

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ వానకాలం సీజన్లో రైతులకు రైతు భరోసా పథకం కింద ఎకరానికి ఆరు వేల రూపాయల చొప్పున నిధులను జమచేసే కార్యక్రమా నికి శ్రీకారం చుట్టింది. రైతు భరోసాతో స్థానికంగా ప్రభుత్వానికి మద్దతు కోసం ప్రయత్నిస్తున్నది. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని సంకేతాలు వస్తున్నాయి. అయితే ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతాయా, గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతాయా అనే విషయమై డైలామా నెలకొన్నది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

● డీపీఓ వీరబుచ్చయ్య

మంథని, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో శశికళ, డీఎల్‌పీవో సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి సన్మానం

ఎలిగేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణను బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

నాటుసారా ప్యాకెట్లు పట్టివేత

మంథనిరూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్ వద్ద 6 లీటర్ల నాటుసారా ప్యాకెట్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సాయికుమార్ తెలిపారు. మల్హర్ మండలం నుంచి ఎక్లాస్‌పూర్ ప్రాంతానికి అక్రమంగా నాటు సారాను ద్విచక్రవాహనం పై సరఫరా చేస్తున్న బానోతు శ్రీను, ప్రతిభలను పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 6 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జేఎన్టీయూలో టెట్ పరీక్షలు

రామగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షలు బుధవారం జేఎన్టీయూ(మంథని) ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం జరిగిన పరీక్షల్లో 48 మందికి కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారు. సాయంత్రం 100 మంది అభ్యర్థులకు 86 మంది హాజరైనట్లు ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ తెలిపారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్



ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే

పాలకుర్తి,జూన్ 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అంకితమై పనిచేస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. బుధవారం మండలం పరిధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు.అలాగే కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది నిజమైన ఇందిరమ్మ రాజ్యం, ఇక్కడ ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందన్నారు. పేదలకు ఇళ్ల మంజూరు పత్రాలు వారి కలలను సాకారం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ జేరుపోతుల సునీత, మక్కాన్ సింగ్ సేవా సమితి చైర్మెన్ మనాలి ఠాకూర్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ ఉపాధ్యక్షుడు

ముత్తారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ముత్తారం మండలంలోని పోతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెల్కల కాంతయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పెద్దపల్లి డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదనాందం పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన వెంట పోతారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్ర మల్లయ్య, ఎంపీటీసీలు చెల్కల సుధీర్, బండ సమ్మయ్య, చెల్కల ఓదెలు, నరేందర్, కిషన్, బత్తుల రాజయ్య, మల్లయ్య, నాంసాని రమేష్, మొగిలి, అనిల్, గట్టయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జ్యోతినగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ సాయి సేవా సమితిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ జి.అన్నా ప్రసన్నకుమారి సందర్శించారు. వంద రోజుల సమగ్ర ఆరోగ్య శిబిరాల నిర్వహణలో భాగంగా సాయి సేవా సమితిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సమగ్ర ఆరోగ్య శిబిరంలో 63 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్, ర్యాండమ్ బ్లడ్ శాంపిల్ , క్షయ, ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించారు. అ లాగే స్త్రీ, పురుషుల జననేంద్రియాల అంటు వ్యాధులు, తెల్లబట్ట పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి శిబిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. 100 రోజుల సమగ్ర ఆరోగ్య శిబిరాలను గ్రామాలు, పట్టణాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అన్నా ప్రసన్న కుమారి కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్.రాజమౌళి, వైద్యాధికారి సాదిక్ పాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు వైద్య సిబ్బందికి జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చందర్, డాక్టర్లు మహేందర్, భావన పాల్గొన్నారు.

మంత్రి వివేక్‌ను కలిసిన నాయకులు



మంత్రి వివేక్ సన్మానిస్తున్న బాబర్

జ్యోతినగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖా మంత్రిగా సెక్రెటేరియేట్‌లో బాధ్యతలు చేపట్టిన జి.వివేక్ వెంకటస్వామిని ఐఎన్‌టియుసి జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు బూమల్ల చందర్ పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : హైదరాబాద్ సచివాలయంలో కార్మిక, మైనింగ్ శాఖ మంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకట స్వామిని పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పెద్దపల్లికి చెందిన మాజీ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గంగుల సంతోష్, కలిపాక సంపత్, నక్క రమేష్, తదితరులు ఉన్నారు.

ధర్మారం : రాష్ట్ర భూగర్భ గనులు, ఫ్యాక్టరీస్ శాఖ మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన గడ్డం వివేక్ వెంకటస్వామిని మాల మహానాడు ఆఫ్ ఇండియా యువజన విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి మగ్గిడి దీపక్ కలిశారు.

బీజేపీ జనగామ మండల అధ్యక్షుడిగా గుండబోయిన భూమయ్య

కళ్యాణ్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ జనగామ మండల అధ్యక్షులుగా గుండబోయిన భూమయ్యను నియమిస్తూ బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఉత్తర్వులను అందజేశారు. ప్రధాన కార్యదర్శిగా శివ కుమార్, బండారి శ్యామ్, ఉపాధ్యక్షులుగా భరత్, శంరత్, పంగ రవి, యేసు లత, కార్యదర్శులుగా మహేందర్, గడ్డం శ్వేత, కొమురవెల్లి విశ్వనాథ్, కల్లెపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా గుండబోయిన పృథ్వీరాజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేయడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.



ప్రాతినిధ్య సంఘ ప్రతినిధులతో జీఎం సమావేశం

రామగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపీఏ డివిజన్‌లోని జీఎం కార్యాలయంలో బుధవారం ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో జీఎం నాగేశ్వర్‌రావు సమావేశం అయ్యారు. ఏరియాలకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. కాలనీలో అసౌకర్యాలు, గనులు, ప్రాజెక్టులో కార్మికుల సమస్యల పరిష్కారంపై చర్చ కొనసాగింది. ఇతర సమస్యలపై కూడా చర్చించారు. దీనిపై జీఎం మాట్లాడుతూ తన పరిధిలో గల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

నిర్మాణాత్మక సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు కొటరవీందర్‌రెడ్డి, నాయకులు సాయికృష్ణ, శ్రీనివాస్‌రావు, మల్లిక్, అధికారులు వై.వి శేఖరబాబు, రామ్మోహన్, సిహెచ్ వెంకటరమణ, రాజ శేఖర్, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, కాశీవిశ్వేశ్వరరావు, చంద్ర శేఖర్, సునీల్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎంఏఐ పురస్కారానికి సింగరేణి ఎంపిక

● 23న ఢిల్లీ విజ్ఞాన భవన్‌లో ప్రదానం ● సింగరేణి వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ గుర్తింపు



బలరాంనాయక్, సింగరేణి సీఎండీ

గోదావరిఖని, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి అవలంభిస్తున్న వ్యయ నియంత్రణ చర్యలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలో ప్రతిష్ఠాత్మక సంస్థ అయిన ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ కాస్ట్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) ప్రతి ఏటా ప్రదానం చేసే జాతీయ స్థాయి పురస్కారానికి సింగరేణి ఎంపికైంది. సింగరేణిలో అనుసరిస్తున్న వ్యయ నియంత్రణను ప్రశంసిస్తూ మెగా పరిశ్రమల విభాగంలో ఐసీఎంఏఐ తృతీయ బహుమతికి సింగరేణిని ఎంపిక చేసింది. 2024 సంవత్సరానికి గాను నేషనల్ అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో తృతీయ బహుమతికి ఎంపిక చేసినట్టు ఐసీఎంఏఐ అధ్యక్షుడు బీభూతి భూషణ్ నాయక్ తెలిపారు. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్ పర్సన్ జస్టిస్ మహోపాధ్యాయ నేతృత్వంలోని న్యాయనిర్ణేతల బృందం ఈ విషయంలో సింగరేణిని 3వ బహుమతికి ఎంపిక చేసినట్టు వెల్లడించింది. ఈ నెల 23న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డు ప్రదానం చేయనున్నారు. ఇందుకోసం సంస్థ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని సింగరేణికి ఆహ్వానం అందింది.

ప్రభుత్వ సంస్థల్లో మెగా విభాగంలో అనేక పరిశ్రమలు ఉండగా ఖర్చు నియంత్రణలో సింగరేణికి 3వ స్థానం లభించడం పట్ల సీఎండీ బలరాం నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, అధికా రుల సమిష్టి కృషికి లభించిన గుర్తింపు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సింగరేణి భవిష్యత్ యువ ఉద్యోగులదే

● జీఎం లలిత్ కుమార్



ఉద్యోగులకు నియామక పత్రాలు అందించిన జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి భవిష్యత్ అంతా కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న యువతరం చేతుల్లోనే ఉందని ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ అన్నారు. బుధవారం కారుణ్య నియామకాల్లో ఎంపికైన 24మందికి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరబోయేవారు ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా పని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని, కంపెనీ పురోభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ ఉద్యోగ అవకాశం కల్పించిన తల్లిదండ్రులను గౌరవించాలని అన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే అన్‌ఫిట్ కావడం, ఆ వెంటనే ఉద్యోగాలు లభించడం సింగరేణిలో మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు.

వీరందరికీ ఆర్జీ-1 ఏరియాలోనే పోస్టింగ్ ఇస్తున్నట్టు జీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీను, సీఎంఓఏఐ ప్రతినిధి శ్రావణ్ కుమార్, జీఎం ఆఫీస్ ఇన్‌చార్జి రాజు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నాగుల వేణు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతులు లేని, నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం కోరారు. ఈ మేరకు బుధవారం రామగుండంలోని కార్యాలయంలో ఎంఈవో గడ్డం చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, అధ్యక్షులు మాతంగి సాగర్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో యోగా డే వేడుకలు



యోగా చేస్తున్న సింగరేణి ఉద్యోగులు

గోదావరిఖని, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జీఎం లలిత్ కుమార్ సూచనల మేరకు ఆర్జీ-1 పరిధిలోని వారం రోజుల పాటు అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులతో యోగా నిర్వహించారు. జీడీకే 1, 2, 2ఏ, 11 ఇంక్లైన్, సివిల్, ఎక్స్‌ప్లోరేషన్, ఏరియా వర్క్‌షాప్, ఏరియా హాస్పిటల్, జీవీటీసీ, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్, సీఎస్‌పీలలో పనిచేసే ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా కోసం సమయం కేటాయించుకోవాలని సాధకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీఎంఓ ఏఐ ప్రతినిధ శ్రావణ్ కుమార్, జీఎం ఆఫీస్ ఇన్‌చార్జి రాజు, ఇంటర్నల్ ఆడిట్ ఫైనాన్స్ మేనేజర్ మోహన్‌రావు, పర్చేజ్ అధికారి భీమ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ నాగుల వేణు,సీనియర్ పీఓ హనుమంతరావు, జీఎం కార్యాలయ సిబ్బంది, శిక్షకులు అన్నపూర్ణ, జ్యోతి పాల్గొన్నారు.